
భూపాలపల్లి 27వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న గండ్ర జ్యోతి


కృష్ణకాలనీ : బీఆర్ఎస్‌లో చేరిన వారితో గండ్ర జ్యోతి, కొత్త హరిబాబు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాల పాలవుతాం

- కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే
- 32శాతం లాభాల్లో వాటా
- 12వేల కారుణ్య నియామకాలు
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

గణపురం, నవంబర్ 17 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కష్టాల పాలవుతామని బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ శుక్రవారం మండలంలోని కేటీకే- 8 ఇంక్లైన్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గండ్ర జ్యోతి ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినా అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే గండ్రను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి కార్మికులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి 994 డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చారన్నారు. అలాగే ఇప్పటి వరకు సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు లాభాల్లో 32శాతం వాటా ఇచ్చారన్నారు. 12 వేల కారుణ్య నియామకాలు, ఎస్టీలకు 665 బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేశారన్నారు. డిస్మిస్ కార్మికులకు సైతం తిరిగి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తమ హక్కులను సాధించుకున్న కార్మికులు వచ్చే ఎన్నికల్లో పార్టీలకతీతంగా పని చేసి, కార్మికుల కష్టాసుఖాల్లో పని పాలుపంచుకున్న గండ్ర వెంకటరమణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. 1988 నుండి పరష్కారం కానీ ఇండ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యే గండ్ర ప్రత్యేక చొరవతో సీఎం కేసీఆర్ సహకారంతో భూపాలపల్లి ఏరియాలో 1000కి పైగా ఇండ్ల పట్టాలు అందజేశారన్నారు. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బీ సమ్మయ్య, టీబీజీకేఎస్ నాయకులు మల్లారెడ్డి, కనకయ్య, రత్నం సమ్మిరెడ్డి, కొలిపాక నర్సింగరావు, బీ కుమారస్వామి, చక్రపాణి, లక్కాకుల శ్రీనివాస్, తిరుతమ్మ, స్వప్న, వాణి, శారద, పుష్ప, కమల పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కృష్ణకాలనీ : బీఆర్ఎస్ పేదల సంక్షేమ పార్టీ అని జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు ఆధ్వర్యంలో కాశీంపల్లికి చెందిన బీజేపీ అర్బన్ ఉపాధ్యక్షుడు మామిడి పవన్ 20మంది అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గండ్ర జ్యోతి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 13వ వార్డు అధ్యక్షుడు గండి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మామిడి కుమార్ యాదవ్, జోరు ఈశ్వర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


రామప్ప ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

## రామప్పలో కార్తీక శోభ

**నాగుల చవితి సందర్భంగా పుట్టల్లో పాలు పోసి పూజలు**

వెంకటాపూర్, నవంబర్ 17 : మండలంలోని రామప్ప దేవాలయంలో శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి, కొబ్బరికాయలు కొట్టి, పూలు, పండ్లు, నైవేద్యాలు, గుడ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. పాలంపేట- గుంటూరుపల్లి గ్రామాల మధ్యలో గల నాగబ్రహ్మక్షేత్రం వద్ద వీరమల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- 169 మందికి ఇంటి వద్దే ఓటు
- నియోజకవర్గంలో 2,26,236 మంది ఓటర్లు
- డిసెంబర్ 3న కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు
- ఎన్నికల నిర్వహణ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల నిర్వహణ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, నవంబర్17 : జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఖరారైనట్లు వెల్లడించారు. వారికి గుర్తులు కూడా కేటాయించామన్నారు. 18 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, వారిలో ఇద్దరి నామినేషన్లు తిరస్కరించినట్లు వివరించారు. 15న ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోగా ప్రస్తుతం 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని తెలిపారు. మొత్తం నియోజకవర్గంలో 2,26,236 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 80 సంవత్సరాలు పైబడ్డ, పీడబ్ల్యూడీ 169 ఓటర్లు ఇంటి వద్దే ఓటు వేయడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 303 పోలింగ్ కేంద్రాల్లో 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. అనంతరం ఈవీఎం యంత్రాలను భారీ బందోబస్తు మధ్య డిగ్రీ కళాశాలలో రిసీవింగ్ తదుపరి కలెక్టరేట్‌కు తరలిస్తామని వివరించారు. డిసెంబర్ 3న కలెక్టరేట్‌లోని ప్రత్యేక హాల్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల రోజు ఈవీఎంలను ఎప్పటికప్పుడు పరిశీలించడానికి ఈసీఐఎల్ నుంచి రెండు టీంలను పంపించాలని ఎన్నికల కమిషన్‌ను కోరామన్నారు. కలెక్టరేట్‌లో సమగ్ర కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి బీఎల్‌వోల ద్వారా ఇంటింటికి ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీతో పాటు ఓటరు తన ఓటు ఏ పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి వినియోగించుకోవాలో మ్యాప్, లొకేషన్ సమగ్ర సమాచారం అందులో ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, వివిధ పార్టీల నాయకులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డీపీఆర్వో ఎండీ రఫిక్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

### ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

రాజకీయ నాయకుల ప్రచారం కోసం ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కలెక్టరేట్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు వారి ఎన్నికల ప్రచారం కోసం వాహనం, మైక్‌ల ఏర్పాటు, సభలు, ఇంటింటి ప్రచారాన్ని 24 గంటల ముందు ఎన్నికల అధికారుల అనుమతి కచ్చితంగా పొందాల్సిందేనని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించామన్నారు. విదేశాల్లో విద్య, ఉద్యోగం కోసం వెళ్లిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం లేదన్నారు. పార్టీల ప్రచారాల అనుమతులను సువిధ పోర్టల్ ద్వారా రిటర్నింగ్ అధికారి రాతపూర్వకంగా అందించిన వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనలను తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. 24 గంటలు కలెక్టరేట్ కార్యాలయంలో ఈ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షిస్తారన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, సెల్ నెంబర్‌ను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా ?

- పుట్ట మధును గెలిపించాలి
- భూపాలపల్లి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి


ప్రచారం చేస్తున్న శ్రీహర్షిణి, బీఆర్ఎస్ నాయకులు

కాటారం, నవంబర్ 17 : 24 గంటల కరెంటు కావాలా ? కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించి ఓటేయాలని భూపాలపల్లి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్ అన్నారు. మండలంలోని ప్రతాపగిరి, మద్రిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గడపగడపకూ వెళ్లి సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోను వివరించారు. ఈనెల 30న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పుట్ట మధును గెలిపిస్తే నియోజక వర్గంకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. బహుజనుల నుంచి రాజకీయాల్లో ఎదిగిన బీసీ బిడ్డ పుట్ట మధూకర్ అని అన్నారు. అర్హులైన మహిళలకు ప్రతి నెల రూ.3వేలు జీవన భృతి అందించేందుకు సౌభాగ్యలక్ష్మి వంటి కొత్త పథకాన్ని రూపకల్పన చేసి సీఎం కేసీఆర్ మహిళల పట్ల తనకున్న గొప్ప మనసును చాటుకున్నారన్నారు. 93 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా రైతు బీమా తరహాలో కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా పథకం ఎన్నో కుటుంబాలకు అండగా మారుతుందన్నారు. ప్రజలందరికీ ఆయన ఆత్మబంధువని మరోసారి నిరూపించారన్నారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలతో విలవిలలాడుతున్న సామాన్య ప్రజలకు సీఎం కేసీఆర్ రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తానని ఊరటనిచ్చారన్నారు. రైతుబంధు, దళిత బంధు దేశంలో మరే రాష్ట్రంలో కూడా లేవన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత జక్కు రాకేశ్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, అశోక్, శకుంతల పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

## ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

ములుగురూరల్, నవంబర్17 : ప్రజల జీవన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆరోగ్య సమస్యలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్ప య్య అన్నారు. శుక్రవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా విద్య, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఆరోగ్య సమస్యలను వివరించాలన్నారు. పిల్లలు ఆరోగ్యకరంగా ఉండేందుకు విద్య, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ విపిన్, ప్రోగ్రాం అధికారి పవన్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించాలి

**ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి**

మహాముత్తారం, నవంబర్17: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 40 ఏండ్లలో కాని అభివృద్ధి స్వరాష్ట్రంలో జరిగిందన్నారు. ఇతర పార్టీల వారు చెప్పే మాటలను నమ్మొద్దన్నారు. మంథని నియోజకవర్గంలో పుట్ట మధు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న విషయం గుర్తు చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ సెక్రటరీ రామంచ దేవేందర్, విద్యార్థి నాయకులు రమేశ్, శ్రీనివాస్, మధుకర్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు